

కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు
మదనపల్లె మండలంలోని కూకటిమానుగడ్డ వద్ద ప్రైవేట్ బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు కోలుకుంటున్నారు. -10లో..



హత్య కేసులో అన్నదమ్ములకు జీవితఖైదు
హత్య కేసులో అన్నదమ్ములకు రాయచోటి కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించిందని రాయచోటి పోలీసులు తెలిపారు. -10లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1007 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	340	340
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 21.74 కిలోలు

న్యూస్‌రీల్

స్టార్‌లైనర్‌లో బస్సు చార్జీల తగ్గింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె నుంచి హైదరాబాద్‌కు వెళ్లే స్టార్‌లైనర్‌లో బస్సు చార్జీలు తగ్గించినట్లు మదనపల్లె ఆర్టీసీ వన్ డీఎం మూరే వెంకటరమణరెడ్డి తెలిపారు. ప్రయాణికుల అభ్యర్థన మేరకు మంగళ, బుధ, గురువారాల్లో చార్జీలు తగ్గించినట్లు తెలిపారు. లోయర్‌బెర్త్ మదనపల్లె–హైదరాబాద్ రూ.1080, మదనపల్లె–సికింద్రాబాద్ రూ.1120, అప్పర్‌బెర్త్ మదనపల్లె–హైదరాబాద్ రూ.1000, మదనపల్లె–సికింద్రాబాద్ రూ.1030 చెల్లించాలన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు



డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో సంప్రదాయ కూరగాయల ఆవశ్యకతపై జాతీయ స్థాయి సదస్సు నేటి నుంచి రెండురోజుల పాటు ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కూరగాయల సాగు, శాస్త్రీయ పరిశోధన ప్రగతి వివరించే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు యునివర్సిటీల వీసీలు డాక్టర్ జయరాం, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ పద్మనాభరెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 793 మంది గైర్హాజర్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 793 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉమ్మడిజిల్లాలో 62 పరీక్షా కేంద్రాలలో 793 మంది గైర్హాజరై 94.81 శాతం హాజరు నమోదైయింది. ఆర్‌ఐవో రమణరాజు కడప, ఖాజీపేట, మైదుకూరులోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మైదుకూరులో కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను ఆయన డిబార్ చేశారు. అలాగే జిల్లా కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్‌సభ్యులు కూడా పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది అయిన సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు మరియు స్వీపర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నవారంతా బదిలీలకు అర్హులని, 5 సంవత్సరాలు ఒకే స్థానంలో సర్వీసు పూర్తి చేసిన వాళ్లు తప్పని సరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

అందరికీ గృహయోగం

పట్టణాలు, నగరాల్లో మధ్య తరగతి ఆదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. అన్ని వసతులతో లేఔట్లు ఏర్పాటు చేసి సరసమైన ధరలకే విక్రయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎంఐజీ లేఔట్లు ఏర్పాటు చేసింది.

కోడూరులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఇది మూడో వెంచర్
- మధ్యతరగతి ఆదాయ వర్గాలకు మంచి అవకాశం



కడప కార్పొరేషన్: సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి కల. ఆ కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంఐజీ లేఔట్లు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించి, తక్కువ ధరలకే ప్లాట్లు విక్రయిస్తోంది. ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో దిగువ అబ్బవరంలో మొదటి లేఔట్ ఏర్పాటు చేశారు. తర్వాత బద్వేల్‌లోని గోపవరంలో...ప్రస్తుతం కోడూరు వెస్ట్ విలేజ్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కోడూరు బస్టాండుకు 5 కిలో మీటరుల, రైల్వేస్టేషన్‌కు 4 కిలోమీటర్ల దూరంలో ఈ లేఔట్ ఉండటం కలిసొచ్చే అంశం. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడ) ఆధ్వర్యంలో ఇక్కడ నీటి వసతి, రహదారులు, పార్కులు, విద్యుత్ వంటి సౌకర్యాలు సమకూర్చనున్నారు.

- అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం, కోడూరు వెస్ట్ విలేజ్‌లో సర్వే నంబర్ 2224/1, 2224/3,2202/1,2202/2, 2202/3,2202/4, 2202/5 లలో 20.00 ఎకరాల విస్తీర్ణంలో 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్(ఎంఐజీ లేఔట్)'ఏర్పాటు చేస్తున్నారు. ఒక చదరపు గజం రూ.5500 విలువతో ఈ ప్లాట్లను విక్రయించనున్నారు. ఇందులో మొత్తం 234 ప్లాట్లు ఏర్పాటు చేస్తుండగా, 240 చదరపు అడుగుల(5 సెంట్లు) ప్లాట్లు–69, 200 చదరపు అడుగుల(4సెంట్లు)ప్లాట్లు–95, 150 చదరపు అడుగుల(3సెంట్లు) ప్లాట్లు–53, ఇతర సైజుల్లో ఉన్న ప్లాట్లు–17 ఉన్నాయి. మధ్యతరగతి ఆదాయ వర్గాల సౌకర్యం కోసం ఏపీ ప్రభుత్వంచే అనుమతి పొంది, ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీ–రెరా) నందు రిజిస్టర్ కూడా చేశారు. 60 అడుగుల తారు(బీటీ)రోడ్డు, 40 అడుగుల సిమెంటు కాంక్రీట్ రోడ్లు, కలర్‌టైల్స్‌తో ఫుట్‌పాత్‌లు, ఈఎల్ఎస్ఆర్ ద్వారా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో నీటి సరఫరా, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో భూగర్భ మురుగు కాలువ పైపులైన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, వర్షపునీటి కాలువలు, వీధి దీపాలు, పార్కులు, బయలు ప్రదేశాలలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయుట వంటి సకల సౌకర్యాలు కల్పించనున్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లను 20 శాతం రిబేటుతో, ప్రభుత్వ పెన్షనర్లకు 5 శాతం ప్లాట్లను రిబేటు లేకుండా పొందే అవకాశం ఉంది.

ఇవీ నిబంధనలు

ఒక కుటుంబానికి ఒక ప్లాటు మాత్రమే ఇస్తారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారు వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఏపీలో తప్పనిసరిగా నివాసితులై ఉండాలి. దరఖాస్తు దారుని ఆధార్‌కార్డు, చిరునామా చెల్లుబాటు అయి ఉండాలి. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ ద్వారా ఎంఐజీపీడీటీసీపీ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 23వ తేది నుంచి నమోదుకు అవకాశం కల్పించారు. ప్లాటు కేటగిరి మొత్తం విలువలో 10 శాతం ముందే చెల్లించాలి. దరఖాస్తుదారులకు కంప్యూటర్ ద్వారా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయిస్తారు. ప్లాటు కేటాయించిన దరఖాస్తు దారులు అగ్రిమెంట్ చేసుకొని తదుపరి మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో ఆన్‌లైన్‌లో జమ చేయాలి. అగ్రిమెంట్ చేసుకున్న తేదీ నుంచి ఒక నెలలోపు ప్లాటు మొత్తం అమ్మకపు విలువలో 30 శాతం, ఆరునెలల్లోపు 30 శాతం, పన్నెండు నెలల్లోపు 30 శాతం, వడ్డీ చెల్లించాలి. నెలలోపే ప్లాట్లు మొత్తం విలువ చెల్లించిన వారికి 5 శాతం రిబేటు ఇస్తారు. ఆలస్యంగా చెల్లించిన వారికి ప్రతి స్టేజీలో 0.5 శాతం వడ్డీతో వసూలు చేస్తారు.

సరసమైన ధరలకే ప్లాట్లు



రైల్వేకోడూరు జగనన్న స్మార్ట్ విలేజ్‌కు సంబంధించి పదిహేను రోజుల్లోనే టెండర్లు పూర్తి చేస్తాం. బద్వేల్ ఎంఐజీ లేఔట్ టెండర్లు పూర్తయ్యాయి. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఒక ప్రొద్దుటూరు ఎంఐజీ లేఔట్ రెరా అనుమతి లభించింది. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులతో తక్కువ ధరలకే ఇస్తున్న ప్లాట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.ఎంఐజీ లేఔట్ల ద్వారా ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. లేఔట్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు ధన్యవాదాలు. – ఎస్. గురుమోహన్, చైర్మన్, అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ

మధ్యతరగతి వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలి. అన్నిచోట్లా హైవేలకు పక్కనే ఇవి ఉన్నాయి. మార్కెట్ ధర ఎక్కువ ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీస ధర నిర్ణయించింది. అన్ని రకాల అనుమతులు తీసుకొని రెరాలో రిజిస్టర్ చేసి ఈ లేఔట్లు వేశాం. త్వరలోనే రాయచోటి దిగువ అబ్బవరంలో రెండోదశ కింద 20 ఎకరాల్లో మరో లేఔట్ వేయబోతున్నాం. –వై ఓ నందన్, వైస్ ఛైర్మన్, అనుడ

కేసుల ఛేదనలో పోలీసుల పాత్ర కీలకం

ఎస్పీ గంగాధర్ రావు



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అనునిత్యం ప్రశాంత వాతావరణంలో ఉండేలా చూడాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ గంగాధర్ రావు ఆదేశించారు. కేసుల ఛేదనలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. శుక్రవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన జిల్లా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. రహదారి భద్రతలో భాగంగా ఎస్పీ తీసుకున్న చర్యలు తెలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు, పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న హత్యకేసులు, రేప్, పోక్సో, ఆస్తులకు సంబంధించి, చీటింగ్, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, రోడ్డు ప్రమాదాలు, ఈ చలానా,స్పందన పిటీషన్లపై, డీపీఓ పెండింగ్ రిపలై ఫైల్స్‌పై ఎస్పీ సమీక్షించారు. పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేయాలన్నారు. అలాగే సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు.

- అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. జిల్లా పరిధిలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఆదేశించారు.
- జిల్లాలో ఇటీవల కాలంలో వివిధ కేసుల్లో అత్యుత్తమ సేవలందించిన జిల్లా పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అమూల్‌తో గరిష్ట ధర



అమూల్ డెయిరీలో యూహెచ్‌టీ పాల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఎండీ అహ్మద్‌బాబు, కలెక్టర్ గిరీషా

మదనపల్లె : పాడిరైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు అమూల్ సంస్థతో రాష్ట్రప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం సత్ఫలితాన్నిస్తోందని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ అహ్మద్‌బాబు అన్నారు. రాష్ట్రంలోని పాడిరైతులకు అమూల్‌తో ఆవుపాలకు రూ.43–44, గేదెపాలకు రూ.87 వరకు గరిష్ట ధర లభించడమే కాకుండా ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట పడిందన్నారు. శుక్రవారం జిల్లా స్పెషల్ ఆఫీసర్ హోదాలో అహ్మద్ బాబు కలెక్టర్ గిరీషాతో కలిసి మండలంలోని కొత్తవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. చిప్పిలిలోని అమూల్ డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా అహ్మద్‌బాబు మాట్లాడుతూ. మదనపల్లె అమూల్ డెయిరీకి 4జిల్లాల నుంచి ప్రతిరోజు 90,000 లీటర్ల వరకు పాలు వస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో అమూల్ డెయిరీ ని గ్రామ గ్రామాన విస్తరింపజేసి, వచ్చే ఏడాదికి 5 లక్షల లీటర్ల పాలసేకరణ లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

అన్నమయ్య జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు, చిత్రంలో కలెక్టర్ గిరీషా తదితరులు

రాయచోటి : 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, అన్నమయ్య జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జగనన్నకు చెబుదాం, వీఎస్‌డబ్ల్యూఎస్ఐ, ప్రయారిటీ బిల్డింగ్స్, వేకెన్సీ పొజిషన్, గడప గడపకు మన ప్రభుత్వం, హౌస్ సైట్స్, హౌసింగ్, హెల్త్, అంగన్‌వాడీ, నాడు–నేడు స్కూల్, రీసర్వే, జగనన్న పాల వెల్లువ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు మాట్లాడుతూ 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పోలీస్ 58, ఏపీఎస్పీడీసీఎల్ 55, సర్వే సెటిల్మెంట్ 28, ఎంఏయుడీ 27, సివిల్ సప్లై 26, రూరల్ డెవలప్‌మెంట్ 17, వీఎస్‌డబ్ల్యుఎస్ 10, రూరల్ వాటర్ సప్లై 13, ట్రాన్స్‌పోర్ట్ 10, అనిమల్ హస్బెండ్రీ 6, సెట్ 5, ఉమెన్ అండ్ వెల్ఫేర్ 5, డిజేబుల్డ్ డిపార్ట్‌మెంట్ 5 ఫిర్యాదులు అందాయని, వాటిపై పద్ధతిగా రిమార్క్ కాలంలో రాసి సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాలో రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతానికి కృషి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు.

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం'ద్వారా 827 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇందులో 50.66 శాతం ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారంలో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో ఉందన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఏఎస్పీ రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

టమాటా రైతుల్ని దోచుకుంటున్నారు

గుర్రంకొండ: గుర్రంకొండ మార్కెట్‌యార్డులో ఎక్కడా లేని విధంగా టమాటా రైతుల్ని జాక్‌పాట్ పేరుతో దోచుకుంటున్నారని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, అన్నమయ్య జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు, జిల్లా కలెక్టర్ గిరిషాలకు రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వెంటనే జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్పందించి రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ రాయలసీమ జేడీ రామాంజినేయులకు ఫోన్ చేసి మట్లాడారు. త్వరలోనే తాను గుర్రంకొండల్లో పర్యటించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- సచివాలయ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, సచివాలయాలు, ఆర్బీకేలు సీఎం మానసపుత్రికలని రాష్ట్ర డైయిరీస్ డెవలెప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్‌బాబు అన్నారు. చేయూతతో సచివాలయ పరిధిలోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. శుక్రవారం మండలంలోని నడిమికండ్రిగ గ్రామంలోని సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లీనిక్, అంగన్‌వాడీకేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారుల పనితీరును పరిశీలించారు. పింఛన్లను ఒకే రోజు పంపిణీ చేసేలా చూడాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లును ఆదేశించారు. విలేజ్ క్లినిక్‌లో ఫ్రిజ్ అందుబాటులో ఉన్నా ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఉమమహేశ్వరమ్మ, డీఎంహెచ్‌వో కొండయ్య, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి,జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్, తహసీల్దార్ ఖాజాబీ,సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీటీసీ బాబయ్య, ఎంపీడీవో వెంకటేశులు, వైద్యాధికారి రవీంద్ర, ఎవో రత్నమ్మ, ఇంజనీర్లు జావిద్, లాల్‌స్వామి, వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్‌లో రాణించిన విద్యార్థి



కర్రు భార్గవ నందన్

జమ్మలమడుగు: తెలంగాణ ఎంసెట్ ఓపెన్ కేటగిరిలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామానికి చెందిన కర్రు భార్గవనందన్ 23వ ర్యాంకును సాధించాడు ఇంజినీరింగ్ విభాగంలో 160 మార్కులకు గాను 150 మార్కులు సాధించినట్లు తండ్రి సంజీవరెడ్డి తెలిపారు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో కూడా 99.6 శాతం మార్కులతో మంచి ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

త్వరలో పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు

కడప అర్బన్: సుప్రీంకోర్టు సూచనల మేరకు దేశవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్రంలో ప్రధానంగా వైఎస్ఆర్ జిల్లా కడపలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కడప వన్‌టౌన్, టూటౌన్, తాలూకా, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కేబుల్ వర్క్‌ను పూర్తి చేశారు. కడపలోని 'దిశ' పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

మామిడి మార్కెట్ కళకళ

- ఎక్కడ చూసినా కాయల రాశులు
- జిల్లాలో అధికంగా సాగు
- ఈ ఏడాది లక్ష పైచిలుకు టన్నుల క్రయ విక్రయాలు
- జూన్ 15 నుంచి 30తో ముగియనున్న సీజన్



రైల్వేకోడూరు మార్కెట్‌లో పోసిన మామిడి రాశులు



మార్కెట్‌లో మామిడి కాయల గ్రేడింగ్

సాక్షి రాయచోటి : మామిడికాయల మార్కెట్ కళకళలాడుతోంది. అటు చెట్ల మీద, ఇటు మార్కెట్‌లోనూ పండ్లు ఊరిస్తున్నాయి. అన్నమయ్య జిల్లాలోనే అత్యధికంగా మామిడి పంట సాగు చేశారు. అనేక రకాల కాయలను పండించడమే కాకుండా ఇతర రాష్ట్రాలకు సైతం పంపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష నుంచి 1.20 లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చినట్లు ఉద్యానశాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఇతర రాష్ట్రాలకు మన మామిడి

అన్నమయ్య జిల్లాలో ఖాదర్, బెంగుళూర, బేనీషా, ఇమామ్ పసంద్, నీలం, లాల్ బహార్ తోపాటు ఇతర అనేక రకాలను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 వేల హెక్టార్లలో సాగు చేశారు. అయితే ఈసారి పూత దశతోపాటు పిందె, కాయ దశలోనూ వైపరీత్యాలు చోటుచేసుకోవడం దిగుమతిపై ప్రభావం చూపింది. అయినప్పటికీ ప్రస్తుతం ఉన్న కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో మహరాష్ట్ర, చండీఘర్, బెంగళూరు, చెన్నై, గుజరాత్, హరియాణ, ఢిల్లీ, హైదరాబాద్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలకు కాయలను తరలిస్తున్నారు. వ్యాపారులు కూడా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి నుంచి సరుకు రవాణా చేస్తున్నారు. జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు మార్కెట్లలో కాయల రాశులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం లాల్ బహార్ టన్ను రూ. 18–23 వేలు ఉండగా, బెంగుళూర రూ. 14–22 వేలు, ఇమామ్‌పసంద్ రూ. 70–80 వేలు, బేనీషా రూ. 18–25 వేలు, ఖాదర్ రూ. 40–45 ధర పలుకుతున్నాయి. అయితే ఇతర రాష్ట్రాల్లో ధర బాగా కనిపిస్తున్నా లోకల్‌గా మార్కెట్లకు వచ్చేసరికి వ్యాపారులు కుమ్మక్కై తక్కువకు కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

జూన్ చివరికి ముగియనున్న సీజన్

మామిడి పంటకు సంబంధించి ప్రస్తుతం కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇప్పడిప్పుడే 70 శాతం మేర కాయలను కోసి విక్రయిస్తున్నారు. జూన్ 15 నాటికి దాదాపుగా కొనుగోళ్ల ప్రక్రియ ముగియనుంది. జూన్ చివరి నానాటికి మార్కెట్‌తోపాటు సీజన్ కూడా పూర్తవుతుంది. ప్రస్తుతం ఎక్కడికక్కడ మార్కెట్లలో మామిడి కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఈసారి లక్ష టన్నులకు పైగా దిగుబడి



అన్నమయ్య జిల్లాలో 31 వేల హెక్టార్లకుపైగా మామిడి పంట సాగులో ఉంది. ఈ ఏడాది లక్ష నుంచి రూ. 1.20 లక్షల టన్నులు వరకు దిగుబడి వస్తోంది. సాధారణంగా హెక్టార్లకు ఎనిమిది టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, ఈసారి 3–4 టన్నులలోపు వచ్చింది. జూన్ చివరి నాటికల్లా మామిడి సీజన్ ముగియనుంది. ఇప్పటికే ఎక్కడికక్కడ కొనుగోళ్లతో మార్కెట్ బిజీగా సాగుతోంది. – రవిచంద్రబాబు, జిల్లా ఉద్యాన అధికారి, రాయచోటి

బదిలీల కోలాహలం

- ముగిసిన ఉపాధ్యాయుల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 28 నుంచి 29 వరకు ప్రొవిజినల్ సీనియార్టీ జాబితా ప్రదర్శన



వివరాలను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం మార్గ దర్శకాలను విడుదల చేసింది. దీంతో డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో సందడి నెలకొంది.శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా 1479 మంది కంపల్సరీ బదిలీలకు, మరో 3416 మంది రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా మండలాల్లో ఎంఈఓలు పరిశీలిస్తున్నారు. వీటిని ఆయా డివిజన్లలో డిప్యూటీ డీఈఓ పరిశీలించి ఒకే చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ శనివారం కూడా కొనసాగనుంది. బదిలీల ప్రక్రియ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నిర్వహిస్తున్నందున కేడర్ల వారిగా ఖాళీలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం సెకండ్‌గ్రేడ్ టీచర్స్‌కు , స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల పక్రియ జరగనుండటంతో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. డిప్యూటీ డీఈఓల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోధ్యాయుల నుంచి జాబితాలను తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ మరో రెండు రోజుల్లో పూర్తి కానుంది.

వెబ్ ఆప్షన్లకు అవకాశం: హెచ్ఎంలు, ఎస్జీటీలు, స్కూల్ అసిసెంట్లకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు ప్రభుత్వం అవకావం కల్పించింది. ఇందులో హెచ్ఎంలకు జూన్ 5 నుంచి 6వ తేదీ వరకు అవకాశం కల్పించారు.స్కూల్ అసిస్టెంట్లకు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు జూన్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. బదిలీ అయ్యేవారు ప్రిపరెన్సియల్ కేటగిరిలో ఉన్నట్లయితే వారు ఆధారాల పరిశీలనకు ముందు ధ్రువీకరణ పత్రాలను అందించాల్సి ఉంటుంది. స్పౌజ్‌కు సంబంధించి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేయాల్సి ఉంటుంది.

బదిలీల షెడ్యూల్ ఇదీ...

- ఈ నెల 24 నుంచి 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను 27 వరకు పరిశీలిస్తారు. 28, 29 తేదీల్లో ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాను ప్రదర్శిస్తారు. జాబితాలో తప్పులుంటే ఉపాధ్యాయులు అభ్యంతరాలు చేసుకునేందుకు 30వ తేదీ వరకు అవకాశం కల్పించారు.
- ఈ నెల 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలు పరిష్కరిస్తారు.
- జూన్ 2, 3 తేదీల్లో వెబ్‌సైట్‌లో తుది సీనియారిటీ జాబితాను ఉంచుతారు.
- జూన్ 4న ఖాళీల ప్రదర్శన ఉంటుంది.

లంకమలలో కూంబింగ్


కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారి, సిబ్బంది

సిద్దవటం : లంకమల అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు వారం రోజులుగా కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్ శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అటవీశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి కూలీకి తీవ్ర గాయాలు

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి కూలీ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. చలిమామిడి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప (60) గ్రామ సమీపంలోని మామిడితోటలో కాయలు కోసేందుకు కూలి పనులకు వెళ్లాడు. చెట్టుపై ఉన్న కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ప్రమాదంలో బాధితుని రొమ్ము ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతికి రెఫర్ చేశారు.

టెంపో ఢీకొని..


బోల్తా పడ్డ టెంపో

చిన్నమండెం : టెంపో ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దేవగుడిపల్లెకు చెందిన శ్రీనివాసులు ద్విచక్రవాహనంలో చిన్నమండెం వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలో.. రాయచోటి వైపు నుంచి టమాట క్రేట్లతో వెళ్తున్న టెంపో వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ శ్రీనివాసులను 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మదనపల్లె : తాళం వేసిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. అమ్మచెరువుమిట్ట సమీపంలోని బృందావన్‌కాలనీకి చెందిన కళ్యాణి రాత్రి సమయంలో ఉక్కపోత భరించలేక ఇంటికి తాళం వేసి మిద్దెపైన నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువాలోని నగలు, నగదు అపహరించుకుని వెళ్లారు. ఉదయాన్నే కిందికి వెళ్లిన కళ్యాణికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, బీరువా తెరచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. రూ.50 వేల విలువ చేసే బంగారు నగలు, నగదు చోరీకి గురైనట్లు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు

- గ్రామస్తుల తక్షణ స్పందనతో తప్పిన ప్రాణాపాయం
- 108, వైద్య సిబ్బంది సేవలు ప్రశంసనీయం


బోల్తా పడ్డ బస్సు వద్ద గుమికూడిన జనం (ఫైల్)


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు కృష్ణమూర్తి, సద్దాం, బస్సు క్లీనర్ రమణప్ప

మదనపల్లె : మండలంలోని వేంపల్లె పంచాయతీ కూకటిమానుగడ్డ వద్ద బెంగళూరు-తిరుపతి ప్రైవేట్ బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు కోలుకుంటున్నారు. బెంగళూరు-మదనపల్లె హైవే రోడ్డుపై బస్సు అతివేగంగా వస్తూ కారును తప్పించబోయి వెనుకభాగాన గుద్ది అదుపుతప్పి రోడ్డుపక్కన కాలువలో గురువారం బోల్తా పడిన విషయం విదితమే. బస్సులో సుమారు 70 మంది వరకు ప్రయాణికులు ఉండగా, అందులో 63 మంది గాయపడగా, వారిలో 11 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న 16 మందిలో శుక్రవారం 13 మంది డిశ్చార్జి అయ్యారు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం రెఫరల్‌పై వెళ్లిన ఆరుగురు బెంగళూరులోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం తప్పినట్లేనని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బస్సు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే కూకటిమానుగడ్డ, చీకలబైలు, బార్లపల్లె, జవుకుపల్లె గ్రామస్తులు తక్షణమే స్పందించడం, బస్సులో నుంచి క్షతగాత్రులను వెలుపలకు తీసుకురావడం, 108 అంబులెన్స్‌లకు సమాచారం అందించడంతోపాటుగా ప్యాసింజర్ ఆటోలలో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనలో మదనపల్లె 108 అంబులెన్స్‌తోపాటుగా సమీప మండలాలకు చెందిన అంబులెన్స్‌లు కూకటిమానుగడ్డకు చేరుకుని తమవంతు సేవలు అందించాయి. బాధితులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్న వెంటనే ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పాల్ రవికుమార్, ఆర్ఎంఓ దివాకర్ ఆస్పత్రిలోని వైద్యులందరినీ అప్రమత్తం చేసి సుమారు 20 మంది వైద్యులతో పాటుగా నర్సింగ్, మెడికల్ సిబ్బందితో సమర్థవంతంగా వైద్యసేవలు అందించారు. బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో కృష్ణమూర్తికి ఒక కన్ను దెబ్బతినడంతోపాటుగా కాలు పూర్తిగా విరిగిపోయింది. మేదరవీధికి చెందిన శారదమ్మ బస్సు కింద పడిపోవడంతో నడుము విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు క్లీనర్ రమణప్ప మాట్లాడుతూ.. విధుల్లో భాగంగా తాను వెనుక డోర్‌లో నిల్చుని ఉండగా, ఉన్నట్లుండి బస్సు సడెన్‌గా బ్రేక్ వేయడం, బోల్తా పడటం జరిగిందన్నారు. ప్రమాదంలో తాను అపస్మారకస్థితికి చేరుకున్నానని, మెలకువ వచ్చేసరికి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానన్నారు. మూడేళ్లుగా బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నట్లు చెప్పారు. కలికిరి మండలం గుండ్లూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ సద్దాం మాట్లాడుతూ బెంగళూరులోని తన చెల్లెలు ఇంటికి వెళ్లిన తాను గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దేవనహళ్లిలో బస్సు ఎక్కానని, అప్పటికే బస్సులో 70 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారన్నారు. బస్సు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న కారును ఢీకొట్టి కాలువలో బోల్తా పడిందన్నారు. ఘటనలో తనకు చేయి విరిగిందని చెప్పుకొచ్చారు.

వలసజీవులే అధికం

భారతీమోటార్ ప్రైవేట్‌బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి రోజూ రెగ్యులర్‌గా నడిచే సర్వీసు బస్సు. ఇందులో భాకరాపేట, రొంపిచెర్ల, పీలేరు, చింతపర్తి, వాల్మీకిపురానికి చెందిన పలువురు జీవనోపాధి నిమిత్తం బెంగళూరు నగరంలో స్థిరపడిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం 8.40 గంటలకు బెంగళూరు యలహంకలో చివరిగా 70 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు నాన్‌స్టాప్ సర్వీస్‌గా విజయపుర, హెచ్‌క్రాస్, చింతామణి మీదుగా మదనపల్లెకు దాదాపు 135 కిలోమీటర్లు కేవలం 2.20 గంటల వ్యవధిలో చేరుకునేందుకు 100-110 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంటుంది. అతివేగంగా, నిర్ణీత సమయానికి వెళుతుందనే భావనతో చాలా మంది ప్రయాణికులు ఈ బస్సు కోసం ఎదురు చూసి మరీ ఇందులో ప్రయాణిస్తుంటారు. ఎప్పటిలాగే వేగంగా వెళుతున్న బస్సు గురువారం ఉదయం అడ్డుగా వచ్చిన కారును తప్పించే క్రమంలో బోల్తా పడటం జరిగింది. బస్సును డ్రైవర్ రాఘవ అతివేగంగా నడుపుతుండటంతో తగ్గించాలని హెచ్చరించినా సమయం సరిపోదని చెపుతూ వేగంగా నడిపాడని ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు చెప్పారు.

పూర్తి స్థాయి దర్యాప్తు

బస్సు ప్రమాద ఘటనపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తామని, బాధ్యులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని డీఎస్పీ కేశప్ప, ఆర్టీఓ మురళీ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను అతివేగంగా నడపడం, ఓవర్ లోడింగ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రైవేట్ బస్సుల వేగంపై దృష్టి పెడతామని, ప్రమాదఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణా శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో రోడ్డు భద్రతా కమిటీతో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలను వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతోపాటు క్షతగాత్రులు, మృత్యువాత పడుతుండడం బాధాకరమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలతోపాటు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అధికంగా మలుపులు ఉండడం, ప్రమాద హెచ్చరికలు, స్పీడ్ నియంత్రిక సూచికలు, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, యూటర్న్ మలుపులు కనిపించకపోవడం, డ్రైవర్ల తప్పిదాలు, మద్యం సేవించి నడపడం, హెల్మెట్ పెట్టుకోకపోవడంతోనే జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్దరేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 30 వరకు 34 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 53 మందికి గాయాలు అయ్యాయని, ఇక మీదట రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిణి శాంతకుమారి, అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఆర్టీసీ ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసు, వైద్య, ఆరోగ్యశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య


గండికోట వెనుక జలాల నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కొండాపురం : స్థానిక తపాలా శాఖ పోస్ట్‌మాస్టర్ కొండు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(31) గండికోట రిజర్వాయర్ వెనుక జలాల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురంలోని తపాలా శాఖలో కొండు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఈ నెల 24న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అదే రోజు కుటుంబ సభ్యులు కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను ద్విచక్రవాహనం, ఫోన్, చెప్పులు రైల్వే వంతెన సమీపంలోని గండికోట వెనుక జలాల వద్ద ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో రెండు రోజులుగా పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో
ముగ్గురు ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంగంవారిపల్లెకు చెందిన కుమారి (20)ని శుక్రవారం ఉదయం కుటుంబ సమస్యలపై భర్త మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె విషపు గులికలు తిని ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారకస్థితిలో ఉన్న బాధితురాలిని గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా మదనపల్లె పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన మహబూబ్‌బాషా (55) కుటుంబ సమస్యల కారణంగా గురువారం రాత్రి ఇంటిలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో..

మదనపల్లె : ఓ వ్యక్తి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బొమ్మనచెరువు పంచాయతీ కోడిజాండ్ల గ్రామానికి చెందిన వై.గణపతి (40) వ్యవసాయ పనులు, భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. అయితే సోదరునితో ఏర్పడిన భూవివాదం, కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంటిలోనే పూలమొక్కలకు పిచికారి చేసే మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

హత్య కేసులో అన్నదమ్ములకు జీవితఖైదు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐలు

సంబేపల్లె/రాయచోటిటౌన్ : హత్య కేసులో అన్నదమ్ములకు రాయచోటి కోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించింది. ఈ వివరాలను రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ ఎమ్‌డీ షరీఫ్ వెల్లడించారు. సంబేపల్లె మండల పరిధిలోని దుద్యాల గ్రామ పంచాయతీ వడ్డెపల్లెలో 2021 డిసెంబర్ 31న పల్లపు రమణ, కోటేశ్వర అన్నదమ్ములు మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని తల్లి కృష్ణమ్మను కొడుతుండగా.. పొరిగింటికి చెందిన పసుపులేటి వెంకటరమణ(57) వారించేందుకు ప్రయత్నించాడు. ఇది నచ్చని అన్నదమ్ములు తమకు అడ్డు చెబుతావా అంటూ కోపోద్రిక్తులై మారణాయుధంతో వెంకటరమణని చెవి కింద భాగాన పొడవగా తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను రాయచోటి 5వ అదనపు కోర్టులో హాజరు పరిచారు. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులపై నేరం రుజువైంది. ఈ నేపథ్యంలో జడ్జి ఎస్.కృష్ణన్ కుట్టి.. ఇద్దరికీ జీవిత ఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసును త్వరగా విచారణ జరిపి ముద్దాయిలకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న రాయచోటి రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ ఎమ్‌డీ షరీఫ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


కువైట్‌లో కొత్త సింగనమల వాసి మృతి


పెంచలయ్య (ఫైల్)

పెనగలూరు : మండలంలోని కొత్త సింగనమల దళితవాడకు చెందిన సింగనమల పెంచలయ్య (28) మంగళవారం కువైట్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బతుకు దెరువు కోసం కువైట్ దేశానికి వెళ్లి పని నిమిత్తం రోడ్డుపై వెళ్తుండగా వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామమైన కొత్త సింగనమల దళితవాడకు చేరుకుంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. నిత్యం కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ యోగక్షేమాలు తెలుసుకుంటున్న పెంచలయ్య.. మృతి చెందాడన్న వార్త తెలియగానే వారు శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వెలుగు చూసిన శిల్పాలు, శాసనాలు


బండపైగల శాసనం


శాసనం వద్ద కొండశిలపై హనుమంతుని శిల్పం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన గండిలో రెండు శాసనాలు, రెండు శిల్పాలను గుర్తించారు. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా పాత ఆలయాన్ని తొలగించారు. స్థల వైశాల్యం కోసం సమీపంలో కొద్దిమేర కొండ శిలలను కూడా తొలగించారు. శుక్రవారం ఆ శిథిలాలను తొలగిస్తుండగా స్థానిక వేద పండితులు రామ్మోహన్.. ఆంజనేయస్వామి రూపం గల శిల్పం, సీతారాములు, గణపతి శిల్పాలను గుర్తించారు. దాంతోపాటు చిన్న శాసనాన్ని కూడా గుర్తించారు. కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఈ ఫొటోలను పంపారు. ఆయన కేంద్ర పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డికి పంపగా ఆయన వాటిని ప్రాథమికంగా పరిశీలించి వివరాలను తెలిపారు. తెలుగు భాషలో ఉన్న ఈ శాసనం 16వ శతాబ్దం నాటిదని, దుందుభి నామ సంవత్సరం మార్గశిర శుద్ధ ద్వాదశి నాడు వేయించినదని మునిరత్నంరెడ్డి తెలిపారు. స్థానికులైన కొండునాయల కుమారుడు బాలకొండ తన తల్లిదండ్రుల పుణ్యం కోసం గండి వద్ద హనుమంతుడి శిల్పం ప్రతిష్ఠించినట్లు ఇందులో ఉందన్నారు. హనుమంతుని కుడ్య శిల్పంగల బండ పక్కనే ఈ చిన్న శాసనాన్ని గుర్తించారని, మరో పెద్ద శాసనం కూడా ఆ పక్కనే ఉందని, దాన్ని చదవడానికి వీలు కావడం లేదని డాక్టర్ చింతకుంట శివారెడ్డి తెలిపారు. శనివారం ఆ శాసనం నకలును తీసి పరిశోధకులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని పక్కనే ధనస్సును ధరించిన శ్రీరాముడుతోపాటు సీతమ్మ, ఆ పక్కనే గణపతి కుడ్య శిల్పం ఉన్నాయని చెప్పారు. శనివారం వీటి గురించి మరింత సమాచారం అందే అవకాశం ఉందని ఆయన వివరించారు.

సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం


సెల్‌టవర్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న కృష్ణమూర్తి, గుమికూడిన ప్రజలు

భార్య కాపురానికి రాలేదని..

మదనపల్లె : తన భార్య కాపురానికి రాలేదని నిరసన వ్యక్తం చేస్తూ సెల్‌టవర్ ఎక్కి ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. వివరాలు.. పోతబోలు పంచాయతీ పాలెంకొండకు చెందిన ఇర్రి రమణప్ప కుమారుడు ఇ.కృష్ణమూర్తి (38)కి బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాలెంకు చెందిన చంద్రకళతో 2004లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణమూర్తి కేరళ రాష్ట్రం కోయంబత్తూరులో నూనెమిల్లులో పని చేస్తున్నాడు. అతని భార్య చంద్రకళ పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. భర్త మద్యానికి బానిసై, కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో ఇద్దరి మధ్య సమస్యలు తలెత్తాయి. తరచూ వివాదాల కారణంగా గొడవపడేవారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన చంద్రకళ తన కుమార్తెలతోపాటు హైదరాబాదులోని అక్క గీత వద్దకు వెళ్లింది. భర్త ఇంటికి రావాలంటూ ప్రాధేయపడినా ససేమిరా అనడంతో, గురువారం కృష్ణమూర్తి తాలూకా పోలీసులను ఆశ్రయించి తన భార్య, పిల్లలను అప్పగించాల్సిందిగా ఫిర్యాదు చేశారు. తాలూకా పోలీసులు చంద్రకళకు ఫోన్ చేసి ఫిర్యాదు విషయం తెలిపి, స్టేషన్‌కు రావాల్సిందిగా చెప్పారు. శుక్రవారం ఉదయం వచ్చి సమస్య పరిష్కరించుకోవాలని చెప్పారు. అదే విషయం కృష్ణమూర్తితో చెప్పి పంపారు. అయితే ఫిర్యాదు అనంతరం భార్యకు కృష్ణమూర్తి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. దీంతో తన సమస్యకు పరిష్కారం లభించదన్న ఆలోచనతో, మండలంలోని సీటీయం క్రాస్ రోడ్డులోని సోమలగడ్డవీధిలో ఉన్న రిలయన్స్‌సెల్ టవర్‌ను శుక్రవారం ఉదయం అందరూ చూస్తుండగానే ఎక్కాడు. తన భార్య, పిల్లలు వస్తేనే కిందకు దిగుతానని, లేనిపక్షంలో దూకి ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితునికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా కృష్ణమూర్తి ససేమిరా అన్నారు. అంతలో పోలీస్‌స్టేషన్ వద్ద హాజరయ్యేందుకు చంద్రకళ హైదరాబాదు నుంచి మదనపల్లెకు చేరుకోగా తాలూకా పోలీసుల సాయంతో సంఘటనా స్థలానికి వచ్చింది. అనంతరం అతను సెల్‌టవర్ దిగాడు. భార్యాభర్తలను స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

బొలేరో, బైక్ ఢీకొని మహిళ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు


కనకమ్మ మృతదేహం

గుర్రంకొండ : బొలేరో వాహనం, బైక్ ఢీకొని మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. మండలంలోని సరిమడుగు పంచాయతీ పరిధి నాగరాజపురానికి చెందిన ఎస్.లక్ష్మీనారాయణ(55), సుబ్బిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.కనకమ్మ(45) శుక్రవారం ఉదయం గుర్రంకొండలో జరిగే వారపు సంతకు వచ్చారు. సాయంత్రం తిరిగి తమ స్వగ్రామాలకు ఒకే ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామం నుంచి టమాట లోడుతో బయలు దేరిన బొలేరో వాహనం గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణ, కనకమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని హుటాహుటిన 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో కనకమ్మ మృతి చెందింది. లక్ష్మీనారాయణకు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.